మూడు పూవులు ఆరుకాయలుగా వుంది.

స్వర్గం భూమి మీదనే లభ్యమవుతోంది.

ఆవిడ ఋణం ఎన్నటికి తీర్చుకోలేము.

"ఆవిడ దగ్గర ఏమి నేర్చుకున్నావు" అని అమ్మమ్మని అమాయకంగా, కొంటెగా అడిగాను.

జీవన తొలి సంధ్యలోని ముచ్చటలేవో, అమ్మమ్మ మనస్సులో మెసిలాయి.

బుగ్గలు కెంపువన్నె కొచ్చాయి.

నా వంక చూడకుండా- తాతయ్య సూటు బీరువాలో పెడుతూ-

చిరునవ్వుగా - నాకు మాత్రం వినబడేలాగా నెమ్మదిగా "వశీకరణం" అని అంది.

## భవసాగరం

తెల్లవారు ఝామున బ్రహ్మ మూహూర్తంలో రామచంద్రయ్యకు మెళుకువ వచ్చింది. దూరంగా ఉన్న ఆలయం నుంచి సుప్రభాత గీతం వినబడుతోంది. నిత్యకృత్యాలు - పూర్తి చేసుకున్నాడు. అనుష్ఠానం యధావిధిగా చేసుకున్నాడు. ఇల్లంతా కలయ తిరిగాడు. ఒక్క క్షణం పొయ్యి దగ్గర ఆగాడు. "మూడు రోజులు పడుకున్నది చాలు. బయటకు దయచేయి" అంటూ ఆజ్ఞాపించాడు. మంచి నిద్దర చెడగొట్టినందుకు యీయనను తన భాషలో మ్యావ్! మ్యావ్! మంటూ తిట్టి పిల్లి బయటకు పారిపోయింది.

రామచంద్రయ్య చిరునవ్వు నవ్వి అద్దంలో తన ప్రతిబింబం చూసుకున్నాడు.

బవిరి గడ్డం, విభూతి పట్టెలు, నుదుటి కుంకం బొట్టు, హిమాలయం మీద నుంచి ప్రవహించే జలపాతంలాగా తెల్లటి యజ్ఞోపవీతం. వయస్సు మీద పడ్డా, ముదిమి కనిపించని కండలు తిరిగిన శరీరం.

ఆ యింట్లో మిగిలిన నాలుగు సామాన్లు తీసుకుని బయటకు వచ్చాడు.

ఉషోదయం అవుతోంది. తూర్పు దిక్కు అరుణం శ్వేతమవుతోంది.

"వెంకన్నా!" అని పిలిచాడు.

ఎదురుగా రిక్షాలో కూర్చున్న ఆ వ్యక్తి రామచంద్రయ్య దగ్గరకు వచ్చాడు. ఆయన తన దగ్గర ఉన్న సామానులు అతనికి ఇస్తూ "వాడుకో" అని అన్నాడు. ఎదుటి మనిషి ప్రశ్నార్ధకంగా చూశాడు. ఈయన చిరునవ్వు నవ్వి.

'వాటి అవసరం తీరిపోయింది' అని అంటూ చేతిసంచీ తీసుకుని ముందుకు నడిచాడు. వెంకన్న ఏదో అడిగాడు. ఆయన వినిపించనట్టుగా ముందుకు సాగిపోయాడు.

తెల తెల్లవారింది. ఉదయాద్రిని తెల్లవెలుగు వచ్చింది.

సాగిన పాదం నడమంత్రపు సిరిమంతుల లోగిలి ఎదుట ఆగింది.

సౌమ్యంగానే పిలిచాడు. "ఈశ్వరరావు గారూ"

ఆయనకు పిలుపు వినిపించింది - ప్రళయకాల రుద్రుడిలాగా బయటకు వచ్చాడు.

"మళ్ళీ వాయిదా అడగటానికి వచ్చారా? సామాన్లు నాలుగు బయట పారేస్తేనే

గాని మీకు బుద్ధిరాదు అంటూ ఏదో ఇంకా చెప్పబోతున్నాడు.

ఆయన నెమ్మదిగా - శాంతంగా సమాధానం చెప్పాడు. "ఇల్లు ఖాళీ చేశాను శుభ్రంగా ఊడ్చి, కడిగి ముగ్గులు పెట్టాను. తాళం చెవులు తీసుకోండి. అంటూ ఆయన చేతిలో పెడుతూ-

'మీకు చాలా ఇబ్బంది కలిగించాను - క్షమించండి' అని అన్నాడు.

ఎదుటి మనిషి క్షణం అవాక్కు అయ్యాడు. ఈసారి నెమ్మదిగా వినయంగానే అడిగాడు. "మీరు ఎక్కడ వుంటారు?"

సమాధానం చిరునవ్వు చెరగలేదు. పాదం ముందుకు సాగింది.

మనస్సును ఎంత నిరోధించడానికి ప్రయత్నం చేసినా శరీరం

"క్షుధ - పిపాస!"

అని అంటోంది - ఈ పూటకు ఓపిక పట్టు అంటూ మనస్సు శరీరాన్ని ఓదారుస్తోంది...

ఆ వూరి జమీందారుల ఇంటి ముందు ఆగాడు -

"రామచంద్రయ్య గారు వచ్చారని అమ్మగారితో చెప్పు" అని గుమ్మంలో నిలబడ్డ నౌకరుతో చెప్పాడు.

ఆవిడ మేడ దిగి క్రింద హాల్లోకి వచ్చింది.

"ఎందుకు వచ్చావు?" అని చిరాకుగా అడిగింది.

అమ్మవారి విగ్రహంలాంటి ఆ వ్యక్తి వంక చూస్తూ ఆయన దీర్ఘ సుమంగళీ భవ! పుత్ర పౌత్రాభి వృద్ధిరస్తు!" అంటూ దీవించాడు.

'ఎందుకు వచ్చావు నాన్నా - ఆయనకు నువ్వు ఇక్కడికి రావడం ఇష్టం ఉండదు - నీకు తెలుసుగా..

"పిల్లల్ని ఒక్కసారి చూసి వెళ్ళిపోతాను. మళ్ళీ మళ్ళీ మీ ఇంటికి వచ్చి - మీకు ఇబ్బంది కలిగించను."

'ఎవరితో సంభాషణ' అంటూ జమీందారు గారి కంఠం పలికింది.

ఆవిడ సమాధానం చెప్పలేదు.

ప్రొద్దున్నే ఎందుకు దయచేశారు - అంటూ వెటకారంగా ప్రశ్న వచ్చింది. రామచంద్రయ్యగారు ఆయన వంక చూసి నెమ్మదిగా సమాధానం చెప్పాడు.

"నేను ఈ రోజున ఈ ఊరునుంచి వెళ్ళిపోతున్నాను వెళ్లే ముందర - మీతో చెప్పి వెడదామని వచ్చాను."

జమీందారుగారు వ్యంగ్యంగా నవ్వుతూ "చాలా కాలానికి మంచి వార్త చెప్పారు" మంచిది వెళ్ళి రండి అంటూ ఆయన లోపలికి వెళ్ళి పోయారు.

ఆవిడ నెమ్మదిగా అడిగింది. "నిజంగానే వెళ్లిపోతున్నావా?"

"వెడుతున్నాను...ఇల్లు ఖాళీ చేసి వాళ్ళకు అప్ప చెప్పాను."

"ఎక్కడ ఉంటావు?"

"మా స్నేహితుడు సీతారామయ్య వాళ్ళ వ్యవహారాలు చూసి పెట్టడానికి వెడుతున్నాను."

ఈ వూరు మళ్ళీ ఎప్పుడు వస్తావు?

"రాను."

ఆవిడ లోపలికి వెళ్ళి పిల్లలను తీసుకు వచ్చింది.

"ఎవరు ఈ పెద్దాయన?" అని పిల్లవాడు అడిగాడు.

ఆవిడ తటపటాయించింది.

"మీ అమ్మగారికి తెలిసిన వాడిని" అంటూ ఆయన శాంతంగానే సమాధానం చెప్పాడు.

పిల్లలు అక్కడి నుంచి వెళ్ళిపోయారు.

ఆవిడ మనస్సులోంచి నిట్టూర్పు వచ్చింది.

"అన్ని విధాలా - అందరి వల్ల మోసపోయావు నాన్నా - పేదవాడి అందమైన కూతురు పెళ్ళాంగా పనికి వస్తుంది. కాని ఆ పిల్ల కన్న పేద తండ్రి వియ్యంకుడుగా, మామగారుగా పనికి రాడు.మామగారని చెప్పుకోవడం నామోషీ! మాకోసం ఎంతో కష్టపడ్డావు ఎన్నో త్యాగాలు చేశావు. నీ కడుపున పుట్టి నిన్ను బికారివాడిని చేశాము. నీ బ్రతుకంతా కష్టాలపాలు చేశాము" అంటూంటే ఆవిడ కంఠం గద్గదమైపోయింది.

"ప్రొద్దున్నే వచ్చి నీ మనస్సు కష్టపెట్టాను - నేనేం కష్టపడలేదు. నేనే త్యాగాలు చెయ్యలేదు. నేను అందరిలాంటి తండ్రినే. కన్న కూతురిని, తను వరించిన వాడికి ఇచ్చి వివాహం చేశాను. పున్నామ నరకం నుంచి రక్షించే కొడుకులకి వాళ్ళ కోరుకున్న చదువులు చెప్పించాను. వారికి వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవడానికి వాళ్లని విదేశాలు పంపించాను. ఇవి త్యాగాలు కావు - ఇవి బాధ్యతలు - నావిద్యుక్త ధర్మం - నా శ్రమకు మంచి ఫలితాలు వచ్చాయి. సంతోషంగా ఉండు తల్లి!". ఆయన అక్కడ నుంచి బయలుదేరాడు.

నాలుగు నిమిషాలు గడిచాయో లేదో - పిలుపు విని వెనక్కి తిరిగి చూశాడు. చిరునవ్వుగా పలుకరించాడు.

"సీతారామయ్యగారు కులాసా" అని.

"ఇల్లు ఖాళీచేసి ఈ వూరు వదిలి వెళ్ళిపోతున్నారుట గదా?" అని ఎదురు ప్రశ్న వచ్చింది.

"వెడుతున్నాను."

"ఎక్కడికి?"

"చిన్నబ్బాయి దగ్గరకు,"

"మీరు చాలా అదృష్టవంతులండి - అమ్మాయి జమీందారుల కోడలు, అబ్బాయిలు ఇద్దరూ విదేశాలలో ఉన్నారు. కోటికి పడగ ఎత్తారు. మీ ఇల్లాలే ఉంటే ఎంత సంతోషించే వారో?" రామచంద్రయ్య ముఖమంతా సంతోషం పులుముకుని ముందుకు ప్రయాణం అయ్యాడు.

అమ్మవారి ఆలయం దగ్గర ఆగాడు. అమ్మవారి దర్శనం చేసుకున్నాడు.

సుమంగళిగా కాలగర్భంలో కలిసిపోయిన తన ఇల్లాలు గుర్తుకు వచ్చింది.

"నా అజ్ఞానంతో - పిల్లల మీద మమకారంతో మిమ్మల్ని సర్వనాశనం చేశాను' ' అంటూ ఆవిడ చివరసారిగా అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

ఆవిడ మాటలు ఈనాటికి నిజమయ్యాయి. ఇల్లు వాకిలి లేదు. సిరి లేదు. సంపాదన లేదు. అందరూ వున్నారు కాని ఆదుకునేవారు లేరు.

'రామచంద్రయ్య గారు నమస్కారం-అమెరికా ఎప్పుడు వెడుతున్నారు? మొన్న నేను న్యూయార్క్ వెళ్ళినప్పుడు మీ అబ్బాయి కనిపించాడు. తను కట్టిన రెండో ఇల్లు చూపించాడు - చాలా బావుంది' అంటూ ఎదుటి మనిషి సంబరంగా చెప్పుకుపోతున్నాడు-

"రామచంద్రయ్య - చిరునవ్వు నవ్వాడు" రేపు బయలు దేరుతున్నాను. ఈ సాయంకాలం మదరాసు వెడతాను" అని అన్నాడు.

"మీ వాళ్ళందరిని అడిగానని చెప్పండి" అంటూ ఆ మనిషి వెళ్ళిపోయాడు.

"రామచంద్రయ్య మనస్సులో మసలిన మాట 'అన్నం' పరబ్రహ్మ స్వరూపం'

కొళాయి నీళ్ళతో కడుపు నిండింది.

పాదం - తిరునాళ్ళ వైపు సాగింది.

"మీ పెద్దవాడికి ఆస్ట్రేలియా గవర్నమెంటు ఏదో పెద్ద బహుమతి ఇచ్చిందిట గదా! మా అమ్మాయి రాసింది. చాలా సంతోషం కలిగింది. ఎలాగైనా మీరు అదృష్టవంతులు. మీ పిల్లలంతా దళం వేసుకుని పుట్టారు. మీరు ఎప్పుడు వెడుతున్నారు అక్కడికి? సరదాగా ఒకసారి వెళ్ళి పిల్లల్ని చూసిరండి. మాలాగా కాదుగా - మీకు డబ్బు సమస్య లేదుగా. పిల్లలు రెండుచేతులా సంపాదిస్తున్నారు - నాలుగు దేశాలు తిరిగి రండి."

రామచంద్రయ్య ముఖంలో సంతోషం కనిపించింది.

"రేపు చిన్న అబ్బాయి దగ్గరకు అమెరికా వెడుతున్నాను శీతాకాలంలో పెద్దబ్బాయి దగ్గరకు వెడతాను" అని అంటూ ముందుకు కదిలాడు.

ఎప్పటి లాగానే ఈ సంవత్సరం కూడా నది ఒడ్డున మంచి కోలాహలంగా తిరునాళ్ళు సాగుతోంది.

రామచంద్రయ్య గారు పిలుపు విని అతని వంక చూశాడు. పేదవారికి వస్త్రదానం జరుగుతోంది 'మీ చేతుల మీదుగా నలుగురికి బట్టలు ఇవ్వండి' అంటూ ఈయనను ఆహ్వానించారు.

బట్టలు తీసుకున్న వారంతా - మనసార మొక్కినవాళ్ళే.

శరీరం మళ్ళీ గుర్తు చేసింది.

'ఉపవాసం - నాలుగో రోజు'-

క్షుధాతురాణాం - నరుచిర్న పక్వం

మనస్సు వద్దంటూంటే వినకుండా పాదం ముందుకు సాగింది. అన్నదానం జరుగుతున్న పందిరి దగ్గరకు శరీరం చేరింది. రామచంద్రయ్యగారిని చూడగానే - పులిహోర పొట్లాలు, దద్దోజనం పొట్లాలు పంచిపెడుతున్న వ్యక్తి - సంతోషంగా నమస్కారం పెడుతూ - "ఒక్కడినే అవస్థ పడుతున్నాను, మీరు కూడా ఈ నారాయణ పూజకి రవ్వంత సహాయం

చెయ్యండి'' అని అన్నాడు.

రామచంద్రయ్యకు సిగ్గు వేసింది. సంతోషం వేసింది. చకా చకా పొట్లాలు పంపిణీ చెయ్యడం మొదలు పెట్టాడు. అన్నార్తులంతా ఆ ధర్మాత్ముడిని వెయ్యి కాలాల పాటు చల్లగా ఉండమని దీవిస్తున్నారు.

"గురువు గారు - మీకోసం పందిళ్ళన్నీ వెదుకుతున్నాం - పందెం ప్రారంభం కాబోతోంది రండి'' అంటూ కుర్రవాళ్ళు చుట్టుముట్టారు.

"నేనా?''

"మీరే సార్ - మీరు లేకుండా ఈ పరగణాలో ఈత పందేలు ఎప్పుడైనా జరిగాయా? ఇంకెవరైనా గెలిచారా?''

రామచంద్రయ్య ఒక్క క్షణం అందరి వంక చూశాడు. మనస్సు ఏదో నిర్ణయానికి వచ్చింది.

"మీరు పదండి, నేను వస్తున్నాను''

మైకులోంచి అన్ని దిక్కులా ప్రకటన వినిపించింది.

"ఈత పందెం అయిదు నిమిషాల్లో ప్రారంభం అవుతుంది. మన జిల్లా గజ ఈతగాడు - పదమూడు సంవత్సరాలుగా ఛాంపియన్. శ్రీరామ చంద్రయ్యగారు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

అందరూ ఈ పోటీ చూడటానికి రావలసిందిగా ఆహ్వానిస్తున్నాం.''

రామచంద్రయ్య గారు - ఒక్కసారి నలుదిక్కులా కలయజూశాడు.

జేబులోని కాగితాలు తీసి ఒక్కొక్కటే చదువుకున్నాడు. మళ్ళీ వాటిని భద్రంగా జేబులో పెట్టేశాడు.

అన్నదానం చేస్తున్న కుర్రవాడిని పిలిచాడు.

'సుబ్రహ్మణ్యం - నా బట్టలు ఇక్కడ పెట్టి వెడుతున్నాను. ఈ గడియారం నీకు ఇస్తున్నాను వాడుకో' అని వడివడిగా నది ఒడ్డుకు వెళ్లిపోయాడు.

పోటీ ప్రారంభమైంది - జనం ఎవరి అభిమానులని వాళ్ళు ఉషారు చేస్తున్నారు. సుబ్రహ్మణ్యం - తన చేతిలోని గడియారం వంక చూశాడు. ఆ బల్లమీద పెట్టిన బట్టల వంక చూశాడు. చొక్కా జేబులోంచి కనపడుతున్న కాగితాల వంక చూసి - వాటిని తీసి చదవడం మొదలుపెట్టాడు. ఒక్కసారి ఉలిక్కి పడ్డాడు.

"రామచంద్రయ్యగారిని ఆపండి. కాపాడండి'' అంటూ బిగ్గరగా పరుగెత్తుకుంటూ నదివొడ్డుకు వెళ్ళాడు. పోటీ హడావిడిలో ఎవరూ ఇతని గోడు వినిపించుకోలేదు - ఈలలు వేస్తున్నారు, చప్పట్లు కొడుతున్నారు.

రామచంద్రయ్యగారు రామబాణంలాగా ముందుకు సాగిపోతున్నాడు. మిగతా పోటీదారులు ఈ లోకంలో మిగిలిపోయారు.

సుడిగుండం ఎదురైంది. కన్నుల ముందర - ఇల్లాలి నవ్వుముఖం కనిపించింది.

రామచంద్రయ్యగారు అందరికీ కనుమరుగయ్యాడు -

"ప్రముఖ గజ ఈతగాడు శ్రీ రామచంద్రయ్య గారు సుడిగుండంలో ప్రమాదవశాత్తు మునిగి మరణించారు" అని పత్రికలలో, రేడియోలో, టి.వి.లో వచ్చిన వార్త.

సుబ్రహ్మణ్యం - ఆ ఉత్తరాలు ఇంకొకసారి చదివాడు. ఒకటి అమెరికా నుంచి, రెండవది ఆస్ట్రేలియా నుంచి - ప్రియమైన తండ్రికి - విధేయులైన కుమారులు. ఆరునెలల క్రితం రాసినవి. భాషలు వేరైనా రెండింటిలో అర్థం, భావం ఒక్కటే!

డబ్బుకోసం మాకు ఉత్తరం రాయవద్దు! మాకు తలకు మించిన ఖర్చులు ఉన్నాయి. డబ్బు పంపడానికి మాకు వీలు పడదు.

నమస్కారములతో .మీ

# అపురూపం

ఆ నాటి ఉదయం అనుష్టానం పూర్తి చేసుకుని దైనందిన కార్యక్రమాలలో పాల్గొనటానికి సిద్ధం అవుతుండగా మా ఇల్లాలు వచ్చి "మీ కోసం ఒక వింత మనిషి వచ్చారు" అని అంది.

"వారి వివరాలు తెలుసుకున్నావా?"

"మన ప్రాంతంవారి లాగా కనిపించడం లేదు. సంపన్నుడు అని వేషం, మీ కోసం వచ్చాడు కాబట్టి పండితుడేమోనని అనుమానం కలుగుతోంది."

"అతిథి మర్యాదలు చేస్తూ ఉండు. నేను ఇప్పుడే వస్తాను... హయగ్రీవ శ్లోకం...చదువుకుని వస్తాను...."

రవ్వంత సేపటికి నేను ముందు సావిట్లో అడుగు పెడుతూ ఆయన్ని చూసి ఒక్క క్షణం అక్కడే ఆగాను.

ఒక శతాబ్దం వెనుకటి వంగదేశపు జమీందారి పద్ధతిలో ఉన్నాడు. అందమైన విగ్రహం, ఆకర్షణీయమైన రూపం, గిరజాల జుట్టు. మంచి మీసకట్టు. శరీరం మీద పట్టువస్త్రాలు, మెడలో పచ్చల పతకం ఉన్న చిన్న హారం. వేళ్లకు విలువైన ఉంగరాలు.

నన్ను చూడగానే లేచి నిలబడి - "హరితస అంబరీష యవనాశ్వయ గోత్రః ఆపస్తంబ సూత్రః శుక్ల యజుశ్శాఖాధ్యాయి. సురేంద్రనాథ పుత్రః వీరేంద్రనాథః అహంభో! అభివాదయే" అంటూ రెండు చేతులు జోడించి తలవంచి నమస్కరించాడు.

నేను ప్రతి నమస్కారం చేస్తూ "కూర్చోండి" అని బెంగాలిలో అన్నాను.

ఆ మాట వినగానే ఆయన ముఖంలో చాలా ఆనందం కనిపించింది...

"మీ సహాయాన్ని అర్థిస్తూ చాలా దూరం నుంచి వచ్చాను."

"చెప్పండి."

"మా కుటుంబంలోని వారు అందరు రామభక్తులు. ప్రతినిత్యం శ్రీమద్ రామాయణం మా ఇంట్లో పారాయణ జరుగుతుంది. మా నాన్నగారి హయాంలో రామాయణ పారాయణతో బాటు రామాయణం మీద పురాణం కూడా చెప్పించడం